క్లుప్తంగా

ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై అవగాహన


హాజరైన రెవెన్యూ అధికారులు, నాయకులు

చీమకుర్తి: నియోజకవర్గంలోని నాలుగు మండలాల రెవెన్యూ అధికారులు, పలు పార్టీల నాయకులతో మంగళవారం ఎల్రక్టోరల్ అధికారి ఎస్.వరకుమార్ సమావేశం నిర్వహించారు. చీమకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పనితీరుపై అవగాహన కల్పించారు. వాటితో పాటు ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలపై ప్రభుత్వ విధానాలను వివరించారు.

కార్మికుల డిమాండ్‌లపై సానుకూలత


ప్రభుత్వ అంగీకరించిన డిమాండ్లను వివరిస్తున్న కమిషనర్ షేక్ ఫజులుల్లా

చీమకుర్తి: సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్‌లపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా కార్మికులకు వివరించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం సమావేశం హాలులో మాట్లాడుతూ కార్మికులకు ఇప్పటి వరకు ఇస్తున్న జీతం రూ.15 వేలకు అదనంగా రూ.6 వేలను ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు పెంపు, సహజ మరణాలకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచి ఇస్తారని వివరించారు. ఇట్టా నాగయ్య పాల్గొన్నారు.

12 నుంచి వాలీబాల్ పోటీలు

ఒంగోలు రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని కరవదిలో గణపతి యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 12,13,14 తేదీల్లో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూర్తి వివరాలకు 8074989174, 8977236818 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ

కొనకనమిట్ల: రెవెన్యూ సమస్యలతోపాటు 'స్పందన'లో వచ్చిన అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అసైన్‌మెంట్ భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. భూముల రీ సర్వే వివరాలను తహసీల్దార్ షాజిదాను అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తయినట్లు తహసీల్దార్ వివరించారు.

100 మద్యం బాటిళ్లు పట్టివేత

ఒంగోలు టౌన్: తాలుకా పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉలిచి గ్రామంలో పాత బెల్ట్ షాపులో అక్రమంగా మద్యం నిలువ ఉంచి నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాలతో రంగంలోకి దిగిన తాలుకా సీఐ పి.భక్తవత్సల రెడ్డి సిబ్బందితో కలిసి బెల్ట్ షాపుపై దాడి చేశారు. 100 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బి.శ్రీనివాసరావును అరెస్టు చేశారు.

అంబరాన సంక్రాంతి సంబరాలు


మాంటిస్సోరిలో భోగిమంటలు వేస్తున్న రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు


హరిదాసుల వేషధారణలో డ్రీమ్స్ చిన్నారులు

ఒంగోలు: ముందస్తు సంక్రాంతి సంబరాలు అలరించాయి. స్థానిక మాంటిస్సోరీ స్కూలులో రెడ్ క్రాస్ చైర్మన్ పి.ప్రకాష్‌బాబు భోగిమంటలు వెలిగించి సంబరాన్ని ప్రారంభించారు. చిన్నారులకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భోగిమంటలు, లక్ష్మీ పూజ, బొమ్మల కొలువు, తదితర కార్యక్రమాల ప్రాముఖ్యతను చిన్నారులకు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ శబరీనాథ్, ప్రిన్సిపాల్ నూరుద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్‌బాబు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

డ్రీమ్స్ ఉన్నత పాఠశాలలో..
స్థానిక డ్రీమ్స్ ఒలింపియాడ్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో కనిపించారు. యాజమాన్యం ముగ్గుల పోటీలు, పిండి వంటల పోటీలు, గాలిపటాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీదేవి మాట్లాడుతూ తెలుగువారి అతి పెద్ద పండుగ సంక్రాంతి అని పేర్కొంటూ భోగి, సంక్రాంతి, కనుమ పండగలను ఎందుకు జరుపుకుంటారో సవివరంగా వివరించి అవగాహన కల్పించారు.

సంతపేట నారాయణ స్కూలులో..
స్థానిక సంతపేట నారాయణ ఈ టెక్నో స్కూలులో ఏజీయం పెద్దిరెడ్డి, క్లస్టర్ ప్రిన్సిపాల్ వేదవతి, పాఠశాల ప్రిన్సిపాల్ వాసంతిల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలైన అయిదుగురికి బహుమతులు అందించారు. గంగిరెద్దుల ఆటపాటలు, భోగిమంటలు, గాలిపటాలు, భోగిపళ్లు, పొంగలి కార్యక్రమాలతో కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది.

రవీంద్రభారతిలో..
స్థానిక రవీంద్రభారతి ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను కరస్పాండెంట్ టి.సాత్విక్ రాజ్ ప్రారంభించారు. భోగిమంటలు, భోగిపళ్లు, బొమ్మల కొలువు, పొంగలి, పిండివంటలు, పల్లెటూరి వాతావరణం సెట్టింగ్, అందమైన ముగ్గులు, హరిదాసుల కీర్తనలు, సంప్రదాయ వస్త్ర ధారణతో చిన్నారులు, ఉపాధ్యాయులు ఇలా సంక్రాంతిని కళ్లకు కట్టినట్లు కనువిందు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పీహెచ్‌జీ కృష్ణంరాజు మాట్లాడుతూ వ్యర్థాలను దగ్ధం చేయడం ద్వారా ప్రతి ఇంట్లో ఒక మంచి వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ టి.లక్ష్మీరాజ్ తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


రవీంద్రభారతిలో బొమ్మల కొలువును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్


ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందిస్తున్న సంతపేట నారాయణ ప్రిన్సిపాల్ వాసంతి


థాంక్స్ యాత్రను ప్రారంభిస్తున్న మాగుంట రాఘవరెడ్డి

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చారిత్రాత్మకం


ఈతముక్కలలో కార్యక్రమం నిర్వహిస్తున్న రవీంద్రరెడ్డి, సుజాత, శ్రీనివాసులు

ఒంగోలు: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలను స్మరించుకునేలా విజయవాడలో 125 అడుగుల భారీ విగ్రహాన్ని ఈనెల 19న సీఎం జగన్ ఆవిష్కరించనున్నారు. దీంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపేందుకు థాంక్స్ యాత్రను జగనన్న రాష్ట్ర అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కావూరి జయకుమార్ మంగళవారం ప్రారంభించారు. స్థానిక రాంనగర్‌లోని తమ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ యువనాయకులు మాగుంట రాఘవరెడ్డి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కావూరి జయకుమార్ మాట్లాడుతూ తనది నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు సంక్షేమంలో, పదవుల కేటాయింపులోను అత్యధిక వాటి కల్పించిన సీఎం ఆదర్శనీయుడన్నారు. ఈ యాత్ర పదిరోజులపాటు ఒంగోలు నుంచి ప్రారంభమై బాపట్ల జిల్లా, పల్నాడు జిల్లా, గుంటూరు జిల్లా, ఎన్‌టీఆర్ జిల్లా, కృష్ణాజిల్లాలోని విజయవాడ స్వరాజ్యం మైదానానికి ఈనెల 19వ తేదీకి చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కావూరి జయకుమార్‌కు వైఎస్సార్‌సీపీ నేతలు అభినందనలు తెలిపారు.

సామాజిక సమత సంకల్పం విజయవంతం చేయండి
చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 19న చేపట్టిన సామాజిక సమత సంకల్ప కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చీమకుర్తి కొత్తకుమ్మరిపాలెం సచివాలయం పరిధిలోని 16,17, 18 వార్డులకు చెందిన కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది స్థానికులకు మంగళవారం విజ్ఞప్తి చేశారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు చెందిన 125 అడుగుల ఎత్తున్న విగ్రహాన్ని సీఎం చేతుల మీదుగా ఆవిష్కరిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సామాజిక సమత సంకల్ప కార్యక్రమానికి ప్రతి సచివాలయం పరిధిలో 5 గురు ప్రతినిధులను ఎంపిక చేసి విజయవాడ కార్యక్రమానికి పంపిస్తున్నట్లు తెలిపారు. స్థానిక వార్డుల కౌన్సిలర్లు ఆముదాలపల్లి ప్రమీల రామబ్రహ్మం, మేకల సులోచన యల్లయ్యతో పాటు సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ఈతముక్కల (కొత్తపట్నం): అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు అంతా సంఘీభావం తెలపాలని జిల్లా అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి పిలుపునిచ్చారు. ఈతముక్కలలో అంబేడ్కర్ విగ్రహం దగ్గర మంగళవారం సర్పంచ్ మేడికొండ సునీత అధ్యక్షతన జన్ భాగీదారి సామాజిక సమతా సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అవగాహన ర్యాలీ, సంతకాల సేకరణ చేశారు. రవీంద్రరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించారన్నారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణంలో వారి పోషించిన పాత్ర గురించి వివరించారు. ఎంపీటీసీ సభ్యురాలు బండారు రుక్మిణమ్మ, కసుకూర్తి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు కిరణ్, నితిన్ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు పదిలం


రక్తదానం చేస్తున్న తనిష్క్ సిబ్బంది

ఒంగోలు టౌన్: రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడినవారవుతారని రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు మాంటిసోరి ప్రకాష్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం టాటా కంపెనీకి చెందిన తనిష్క్ గోల్డ్ షోరూం సిబ్బంది మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రకాష్ మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో తనిష్క్ సిబ్బంది రక్తదానం చేయడం స్వాగతించదగిన విషయమన్నారు. ప్రతి ఒక్కరూ సాటి మనిషిని ఆదుకోవాలన్న ఆలోచన కలిగి ఉండాలని చెప్పారు. ఆరోగ్యవంతులైన వ్యక్తులు తరచుగా రక్తదానం చేయడం వలన సాటి మనిషిని కాపాడడమే కాకుండా స్వయంగా తమ ఆరోగ్యాన్ని రక్షించుకున్న వారవుతారని చెప్పారు. మహిళలు, బాలికలు, చిన్నారులు రక్తహీనతతో బాధ పడుతున్నారని, అలాగే దురదృష్టవశాత్తు ప్రమాదాలకు గురైన వారు సకాలంలో రక్తం దొరకక పోవడంతో ప్రాణాలను కోల్పోతున్నారని రిటైర్డ్ ప్రిన్సిపాల్ పోటు నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, జిల్లా కో ఆర్డినేటర్లు శ్రీనివాస్, స్టాంతున్, షోరూం ఇన్‌చార్జి చౌదరి , మేనేజర్ నవీన్, శిరిష పాల్గొన్నారు.

ఎడ్‌సెట్ విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి


అంజిరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: ఎడ్‌సెట్ విద్యార్థులకు తక్షణమే కౌన్సెలింగ్ నిర్వహించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ యం.అంజిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ సకాలంలో కౌన్సెలింగ్ నిర్వహించక పోవడం వలన 10900 మంది విద్యార్థులకు ఈ విద్యాసంవత్సరం కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ సిసింద్రి, నాయకులు అన్వేష్, దాసరి వెంకటేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురైన మహిళకు చేయూత


లక్ష్మీ ప్రసన్నకు ఆర్థిక సహాయం అందిస్తున్న సూర్యశ్రీ ట్రస్టు సభ్యులు

ఒంగోలు అర్బన్: స్థానిక ముక్తినూతలపాడుకు చెందిన కనపర్తి లక్ష్మీ ప్రసన్న ఏడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై శరీరంలో సగభాగం చచ్చుబడి పోయింది. దీనికి తోడు ఆమె కుటుంబంలో మరో ఇద్దరు మానసిక వికలాంగులున్నారు. విషయం తెలుసుకున్న సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్టు సభ్యులు ఆమెకు మంగళవారం రూ.75వేల ఆర్థిక సహాయం అందించారు. ట్రస్ట్ కార్యదర్శి సర్దార్ బాషా, మండవ సుబ్బారావు, నేరెళ్ల శ్రీనివాసరావు, గొల్లపూడి రవి, సుబ్బారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా దోస్తీ ఫౌండేషన్


విద్యార్థులకు పండ్లు అందిస్తున్న సభ్యులు

ఒంగోలు సెంట్రల్: దోస్తీ ఫౌండేషన్ విద్యార్థులకు ఎల్లప్పుడూ చేయూత ఇస్తుందని చైర్మన్ షేక్ మహబూబ్ అన్నారు. లాయర్ పేటలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో మంగళవారం విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. దోస్తీ ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ మాట్లాడుతూ ఉన్నత చదువులకు సైతం ప్రభుత్వం చేయూత ఇస్తుందని ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని కోరారు. మారెళ్ల సుబ్బారావు, దన్నారపు మస్తాన్‌రావు, తన్నీరు సురేష్, నత్తల శ్రీనివాసరావు, వసతి గృహ సంక్షేమ అధికారి రత్తయ్య పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

ఈతముక్కల (కొత్తపట్నం): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంలో సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నామని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరి బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి అన్నారు. ఈతముక్కలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మేడికొండ సునీత, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, ఎంపీటీసీ సభ్యురాలు బండారు రుక్మిణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ పరిశీలన


పెరిగిన పంఛన్లు చూపిస్తున్న లబ్ధిదారులు


పింఛను అందిస్తున్న వలంటీర్ నామేపల్లి మల్లికార్జున్


అల్లూరులో..

అల్లూరు (కొత్తపట్నం): నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ ఏపీడీ జి.వరప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు. అల్లూరు గ్రామంలో పర్యటించారు. కార్యదర్శి ఐపీ రామారావు, వెల్‌ఫేర్ అసిస్టెంట్ జి.రంగనాథ్ ఉన్నారు.

పింఛన్ల పంపిణీ
అల్లూరు (కొత్తపట్నం): ప్రతి నెలా ఇచ్చే రూ.3 వేల పింఛన్‌తో ఆత్మస్థైర్యంతో బతకగలమని పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అల్లూరు సచివాయలం-1,2లో మంగళవారం వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమాన్ని సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ అధ్యక్షత నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, కార్యదర్శి ఐపీ రామారావు, బెంజిమెన్, హిమబిందు పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛను అందజేత
చీమకుర్తి: చంద్రపాడు గ్రామానికి చెందిన వలంటీర్ నామేపల్లి మల్లికార్జున్ సోమవారం హైదరాబాద్ వెళ్ళి చికిత్స పొందుతున్న తలారి చెన్నయ్యకు రూ.3 వేలకు పింఛన్‌ను అందించాడు. గుండె జబ్బుతో బాధపడుతూ తలారి చెన్నయ్య హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


పరీక్షలకు హాజరైన గర్భిణులు

కొత్తపట్నం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమం ద్వారా 48 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ వైష్ణవి తెలిపారు. కావాల్సిన మందులు ఉచితంగా పంపిణీ, సీమంతం నిర్వహించారు. కాన్పు సమయంలో పీహెచ్ సెంటర్‌కు వచ్చి సుఖ ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌వో ఓంకార్ భోజనాలు ఏర్పాటు చేశారు. డాక్టర్ రమ్య దీపిక, యూడీసీ శరత్‌బాబు పాల్గొన్నారు.

గోదాదేవికి దీపారాధన


దీపారాధనలో మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: తిరుప్పావై ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సంతపేట సాయిబాబా మందిరంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మహిళలు గోదాదేవి అమ్మవారికి మంగళ నీరాజనాలు సమర్పించారు. 24 రోజులుగా చేస్తున్న తిరుప్పావై వ్రతంలో స్వామి గోపికలకు సాక్షాత్కరించిన రోజుగా ఈ పాశురం ప్రసిద్ధి గాంచిందన్నారు.